క్లుప్తంగా

సంతలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఇచ్చోడ మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో లక్ష్మణ్, ఈవో సూర్యప్రకాశ్‌ల ఆధ్వర్యంలో పశువుల, మేకల, వారసంతలకు వేలం నిర్వహించారు. పశువుల సంతను రూ. 6 లక్షల7 వేలకు నైతం భీంరావు, మేకల సంతను రూ. 9లక్షల60 వేలకు గట్టు లక్ష్మి దక్కించుకుంది. వారసంత రూ. 6 లక్షల81 వేలకు బొనగిరి వేణు దక్కించుకున్నారు. వేలం పాట ద్వారా ఇచ్చోడ పంచాయతీకి రూ. 22లక్షల48 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అద్దె గదులకు వేలం పాటలలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటి వేలంను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మాజీ ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. మండలంలోని కోకస్‌మన్నూర్ ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన హెల్త్‌క్యాంపులో రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాష్, ఏఎన్‌ఎంలు అహల్య, తులిసి, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సన్మానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సంగీత దర్శకత్వంలో రాణిస్తున్న కల్లెపెల్లి శేఖర్‌ను శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా శేఖర్ డీజే సాంగ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారని అన్నారు. ప్రముఖ సినీకొరియో గ్రాఫర్ శేఖర్ మాస్టర్ పాటలకు మ్యూజిక్ అందిచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, చిట్టి రవి, గోటిముక్కులే మధుకర్, జన్నారం సాయి, కాశిపాక విష్ణు, రాజు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు

జైనథ్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని గూడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కందుల గజేందర్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ఆవరణలోని కిచెన్ గార్డెన్‌లో కూరగాయల మొక్కలు నాటారు. విద్యార్థులకు రసాయన ఎరువులు లేని ఆరోగ్యకరమైన కూరగాయలు అందించాలనే లక్ష్యంతో కిచెన్ గార్డెన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట రమ రమేశ్, శ్రీపతి రావ్, ఏఏపీసీ చైర్మన్ కంది సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక మహాసభను ఆదివారం రైతువేదికలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రైతుభరోసాపై సలహాలు, సూచనలు రైతుల ద్వారా తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా సహకార సంఘం అధికారి మోహన్ హాజరవుతున్నారని, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇంద్రవెల్లిలో వర్షం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు వాల్గోండ, వడగామ్, కేస్లాపూర్, దస్నాపూర్, హీరాపూర్, అంజీ, మామిడిగూడ, సకారంతండా, డొంగర్‌గాం గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షం కురువడంతో పత్తి, సోయా, ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మండల పంచాయతీ అధికారి మహేందర్ రెడ్డి, ఈవో అంజయ్య అన్నారు. శనివారం సాయినగర్ కాలనీలో పర్యటించి, కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు సీసీ రోడ్లు లేకపోవడంతో రోడ్లు బురద మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పిచ్చి మొక్కలు తొలగిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

బస్తీ దవాఖానాకు సుస్తీ

- భవనం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోని వైనం
- ఏడాదిగా అలంకారప్రాయంగానే
- పట్టించుకోని సంబంధిత అధికారులు



అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం న్యూ హౌజింగ్ బోర్డు పరిధిలోని అదిత్యనగర్‌లో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానా అలంకారప్రాయంగా మారింది. భవనం పూర్తయి ఏడాది గడుస్తున్నా.. ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. చూసేందుకు సుందరమైన భవనం కనిపిస్తున్నా.. పేద ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి రావడం లేదు. భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టింపులేనితనంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా దానిపై ఆధారపడ్డ ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడుతున్నారు.

పనులన్నీ పూర్తి..

నానాటికి విస్తరిస్తున్న పట్టణాల్లోని ప్రజల అవసరాలకనుగుణంగా స్థానికంగానే వైద్యసేవలను అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పేద ప్రజలు అత్యధికంగా ఉండేటువంటి సర్వే నెంబర్ 170 , ఆదిత్యనగర్, న్యూహౌజింగ్ బోర్డు కాలనీలకు ఉపయోగపడేలా జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) కింద బస్తీ దవాఖానాను మంజూరు చేశారు. దీని నిర్మాణానికి రూ.16 లక్షల నిధులు మంజూరు చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ భవనానికి టెండర్లను నిర్వహించి పనులు అప్పగించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి గతేడాది కిందట భవనాన్ని పూర్తి చేశారు. ఆకర్షించేలా భవనానికి అందమైన రంగులను వేయడంతో పాటు బస్తీ దవాఖానా అంటూ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ భవనం బోర్డుకే పరిమితమైంది. తప్పా.. ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. గతేడాది కాలంగా అలంకారప్రాయంగానే మారింది.

అందని వైద్యసేవలు

బస్తీ దవాఖానా భవనం పూర్తి కావడంతో ఇక తమకు స్థానికంగానే వైద్యసేవలు అందుతాయని ఆయా కాలనీల ప్రజలు ఎంతో ఆశపడ్డారు. కానీ గత ఏడాది కాలంగా ఈ భవనం ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో వారి ఆశలన్నీ నిరాశగానే మిగిలాయి. బస్తీ దవాఖానా ఏర్పాటైతే వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే వైద్యసేవలు పొందవచ్చని భావించిన కాలనీవాసులకు అవస్థలు తప్పడం లేదు. తమ వద్ద పేరుకు ఆసుపత్రి ఉన్నమాటే అయినప్పటికీ అక్కడ వైద్యం మాత్రం అందుబాటులోకి రాలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారా కూడా స్పష్టత లేదు. ఆసుపత్రి సేవలను అందుబాటులోకి తెచ్చేలా చూడాల్సిన వైద్య ఆరోగ్యశాఖాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

వసతులు కల్పించాల్సి ఉంది

ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నిధులు రూ.16 లక్షలతో భవనాన్ని పూర్తి చేశాం. అయితే అందులో విద్యుత్, తాగునీరు, ప్రహరీ కనీస వసతులు కల్పించాలి. ఇందుకోసం మరో రూ.10లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. ఆ నిధులు మంజూరైతే పనులు పూర్తి చేసి భవనాన్ని వైద్యారోగ్యశాఖకు అప్పగిస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం, కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో ఇంకా భవనాన్ని ఆశాఖకు అప్పగించలేదు.

– సంతోష్, డీఈ, ఐటీడీఏ

మారెమ్మ తల్లికి బోనాలు





జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గల మారెమ్మ తల్లికి చించర్‌వాడ కాలనీవాసులు శనివారం బోనాలను సమర్పించారు. బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు పండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఏటా మారెమ్మకు బోనాల సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని కాలనీవాసులు తెలిపారు. బోనాల్లో భాగంగా పోతరాజు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. – ఆదిలాబాద్

నిలిచిన భగీరథ నీటి సరఫరా

నార్నూర్: మిషన్ భగీరథ నీటి సరఫరా వారం రోజులుగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బిందెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో జైనూరు మండలంలోని ధనోరా మిషన్ భగీరథ వాటర్ సప్లై సంపులో భారీగా మురుగు నీరుచేయడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. నీటి సమస్య ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఈనెల 25న మండల కేంద్రంలో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులను ఆదేశించారు. అయినా కొన్ని గ్రామపంచాయతీలో కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

మరో మూడు రోజులు..



తాళం వేసి ఉన్న మాన్యాపూర్ భగీరథ పంప్ హౌస్

కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని ధనోరా గ్రామం వద్ద ఉన్న మిషన్ భగీరథ నీటి సరఫరా సంపులో భారీగా మురికి నీరు చేరడంతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాని, వాటర్ గ్రిడ్ ఏఈ సాయికిరణ్ తెలిపారు. మరో మూడు రోజులు నీటి సరఫరాకు సమయం పడుతున్నారు.

రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న మండుల రమేశ్

తలమడుగు: పంటలు సాగు చేసే రైతులందరికీ రైతుభరోసా పథకం వర్తింపజేయాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఝరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంల ఆధ్వరంలో ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. రైతుభరోసా, సలహాలు సూచన తెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయంలో పంటలు సాగు చేసే రైతులందరికీ నిబంధనలు లేకుండా రైతుభరోసా ఇవ్వాలన్నారు. కనీసం 20 ఎకరాల వరకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎరువుల ధరలు కూడా తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహకార సంఘం డీసీవో మోహన్, జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, తలమడుగు సహకార సంఘ చైర్మన్ దామోదర్ రెడ్డి, ఝరి సహకార సంఘం చైర్మన్, శ్రీనివాస్ రెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, భూమారెడ్డి, ఉపాధ్యక్షుడు పద్మకర్ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేరడిగొండ: రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ అన్నారు. శనివారం కుమారి రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో రైతుల సలహాలు, సూచనలపై సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగా రైతుబంధు పథకాన్ని ఎన్ని ఎకరాలకు ఇవ్వాలి అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఏఈవోలు అపర్ణ, అరుణ, రాజు, సీఈవోలు ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి

బోథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ అధ్యక్షతన శనివారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బోథ్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రతీ రైతుకు ఎకరానికి రూ. 15 వేల రూపాయలు రైతుకు పెట్టుబడి సహాయం కింద రైతుభరోసా పథకం ద్వారా అందిస్తామని తెలిపారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని జిల్లా వ్యవసాయాధికారి పులయ్య తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణ, పీఏసీఎస్ సీఈవో స్వామి, డైరెక్టర్లు గొర్ల రాజు యాదవ్, లోలపు పోశెట్టి, చట్ల ఉమేష్, నడిపేన్న పాల్గొన్నారు.

రాథోడ్ రమేశ్ సేవలు చిరస్మరణీయం



రాథోడ్ రమేశ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సేవలు చిరస్మరణీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మృతి చెందడంతో ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి చేరుకొని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అలాగే లంబాడాల కోసం ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు.

నార్నూర్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం సమాజానికి తీరనిలోటని నంగారా బేరి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సంజీవ్ నాయక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రమేశ్ వ్యవసాయ కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగి నార్నూర్ జెడ్పీటీసీగా.. ఖానాపూర్ ఎమ్మెల్యేగా.. జిల్లా పరిషత్ చైర్మన్‌గా , ఎంపీగా ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు.

ఎదులాపురం: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అకాల మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్, ప్రవీణ్‌కుమార్, టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. మాజీ పార్లమెంట్, శాసన సభ్యులు, జెడ్పీ చైర్మన్‌గా జిల్లా అభివృద్ధి పాటుపడ్డారని, జిల్లా ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ చేసిన సేవలు మరువలేనివని నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూర్ గంగాధర్ అన్నారు. శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుర్గం ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు దుర్గం శేఖర్, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నవీన్ యాదవ్ వేర్వేరు ప్రకటనలో సంతాపం తెలిపారు.

డీఎస్ మృతిపై జోగు రామన్న సంతాపం



డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాజకీయ కురువృద్ధులు, సీనియర్ నాయకుడు డి.శ్రీనివాస్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డీఎస్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాథోడ్ రమేశ్ మరణం తీరని లోటు..

బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మరణం తీరని లోటని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో ఉన్న స్నేహపూర్వక సంబంధాలు ఎప్పుడు మరువలేనివని స్మరించుకున్నారు.

మున్నూరుకాపులకు తీరని లోటు

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయంగా, సమాజం పట్ల ఎంతో అనుభావం కలిగిన డి. శ్రీనివాస్ మృతి మున్నూరు కాపు కులస్తులకు తీరని లోటని మున్నూరుకాపు సంఘం నేతలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తాలూకా మున్నూరు కాపు సంఘ భవనంలో ధర్మపురి శ్రీనివాస్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు విఠల్, శ్రీనివాస్, శంకర్, ఈశ్వర్, నర్సింగ్, అరవింద్, బండారి కృష్ణ, వెంకన్న, నరేందర్ పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం



సూపరింటెండెంట్‌ను సత్కరిస్తున్న కమాండెంట్ నితిక పంత్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ 2వ పోలీస్ బెటాలియన్‌లో ఈనెల 30న పదవీ విరమణ పొందనున్న కార్యాలయ సూపరింటెండెంట్‌ను జొసోఫైన్‌ను కమాండెంట్ నితిక పంత్ శనివారం సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పత్రాన్ని అందజేశారు. భవిష్యత్ ఎలాంటి అవసరమున్న తన వంతు సహాయ, సహకారాలు అందిస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు ఏజీపీ నారాయణ, దేవిదాస్ రాథోడ్ ఉన్నారు.

పరామర్శ

తాంసి: భీంపూర్ మండల గుంజాల గ్రామానికి కాంగ్రెస్ కార్యకర్త కాంతారావు మాతృమూర్తి ఇటీవల మరణించింది. కాగా బాధిత కుటుంబాన్ని శనివారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మండల నాయకులు మల్లేష్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో మహాజన సభ



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సహకార సంఘంలో సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం రైతులకు అందచేయనున్న రైతుభరోసా పథకం ఎన్ని ఎకరాల రైతులకు వర్తింపజేస్తే బాగుంటుందని సలహాలు, సూచనలు తీసుకున్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బద్దం పురుషోత్తంరెడ్డి, సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎదులాపురం: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ నాయకులు జిల్లా కేంద్రంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ అభ్యర్థులను న్యాయం చేయాలని వాల్ పోస్టర్లు ప్రదర్శించారు. జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, నరేంద్ర మోదీ బాధ్యతవహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జూలై 4న నిర్వహించే మహాధర్నాలో విద్యార్థులు, నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్, అనిల్, సంతోశ్, శంకర్, రాజేశ్, శ్రీవర్షిణి, శృతి, మల్లీశ్వరి, అనూష, ఐశ్వర్య, భూమిక పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి

ఆదిలాబాద్‌టౌన్: పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు తమ శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పదవీ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ ఎస్సై సుంకరి సాయన్న, తాంసి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గణపతిలను శనివారం జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో సత్కరించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, ఉద్యోగులు కుటుంబీకులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న అడ్డి భోజారెడ్డి

జైనథ్: ఏడీసీసీ బ్యాంకు నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 రోజుల్లో పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. వీలైనంత త్వరలో బ్యాంక్‌ను నూతన భవనంలోకి మార్చాలన్నారు. రైతులకు రుణాలు అందించడం ముందుండాలన్నారు. ఆయన వెంట ఏడీసీసీ మేనేజర్ శైలేందర్ రెడ్డి, ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, జగదీష్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, పోతరెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి గంగన్న, తదితరులు ఉన్నారు.

పాడి పరిశ్రమతో అభివృద్ధి



పాడి పరిశ్రమను పరిశీలిస్తున్న పుల్లయ్య

నేరడిగొండ: పాడి పరిశ్రమతో యువకులు, రైతులు అభివృద్ధి చెందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని కుమారి గ్రామంలో రైతు చంద్రశేఖర్ రెడ్డి నిర్మించిన పాడి పరిశ్రమను పరిశీలించారు. పాడి పరిశ్రమ ద్వారా పాల కొరత తీరుతుందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. జిల్లా పాడి పరిశ్రమ కేంద్రం ద్వారా 35 శాతం సబ్సిడీ కింద పాడి పరిశ్రమను నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల యువకులు, రైతులు దరఖాస్తు చేసుకొని పాడి పరిశ్రమతో అభివృద్ధి చెందాలన్నారు. వీరి వెంట కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, గ్రామస్తులు ఉన్నారు.